క్లుప్తంగా

ఆలయాల శుద్ధి



చిలకలపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో శుద్ధి చేస్తున్న అర్చకుడు రాంబాబు

బలిజిపేట: రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం అనంతరం ఆలయాలను అర్చకులు సోమవారం శుద్ధి చేశారు. అందులో భాగంగా చిలకలపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి అర్చకుడు కె.రాంబాబు పుణ్యాహవాచనం పంచామృత అభిషేకాలతో శుద్ధి స్నానం చేయించి స్వామివారికి నూతన వస్త్రాలను ధరింపచేసి, పూలతో అలంకరించి ధూపదీప, నైవేద్యాలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

నీటిని కాచి వడపోసి తాగండి

సాలూరు: మున్సిపాలిటీలో సరఫరా అవుతున్న తాగునీటిని కాచి వడపోసి తాగాలని మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెద్దగెడ్డ రిజర్వాయర్, వేగావతి నది నుంచి నీరు బురదగా వస్తున్న క్రమంలో హెడ్‌వాటర్ వర్క్స్ వద్ద గల ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో బురదనీరు చేరుతోందన్నారు. కావున హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి వచ్చు నీటిని కాచి వడపోసి ప్రజలు తాగాలని సూచించారు.

ఏడాది కాకముందే శిథిలావస్థకు చేరిన కల్వర్టు



శిథిలావస్థకు చేరిన కల్వర్టును చూపిస్తున్న సీపీఎం నాయకుడు పి.రాము

పార్వతీపురం రూరల్: మండలంలోని ములగ గ్రామం నుంచి డోకిశీల వరకు ఇటీవల ప్రభుత్వం నిర్మించిన కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా శిథిలమై, రాళ్లు తేలి శిథిలమైన భాగాలు కొట్టుకుపోయే పరిస్థితి నెలకొందని పార్వతీపురం మండల సీపీఎం నాయకుడు పి.రాము అన్నారు. దీనికి ప్రధాన కారణం పనుల్లో నాణ్యతా లోపమేనన్నారు. రోడ్డు, కల్వర్టు నిర్మాణం చేసి ఏడాదికాలం కాకముందే ఈ విధంగా జరగడానికి నాసిరకం పనులే కారణమన్నారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.వరాలు, కె.చిరంజీవి, ఎం.రాము, టి.సోములు, ఎం.బాషా తదితరులు పాల్గొన్నారు.


గిరిజన వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి



ఐటీడీఏ డీడీ కృష్ణకుమారికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురం టౌన్: ఐటీడీఏ పరిధిలో గల గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ డీడీ కృష్ణకుమారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సాలూరు మండలం తోణాం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు సంబంధించి మరుగుదొడ్లకు నీటి సదుపాయం కల్పించాలని, కురుపాం మండల కేంద్రంలో ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు తరగతి గదులు, వసతి గృహాలకు అదనపు భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.చంద్రశేఖర్, ఇ.రామకృష్ణ, సీతారాం, లోవరాజు, బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

గరికపాటి రాజారావుకు ఘనంగా నివాళి



గరికపాటి రాజారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజానాట్యమండలి సభ్యులు

పార్వతీపురం: ప్రజానాట్యమండలి వ్యవస్థాపకుడు డా.గరికపాటి రాజారావు వర్ధంతి సందర్భంగా ప్రజా నాట్యమండలి సభ్యులు సోమవారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ వైద్య వృత్తిని కొనసాగిస్తూ అనేకమంది కళాకారులను తయారుచేసి ప్రజా నాట్యమండలిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన వ్యక్తి రాజారావు అని కొనియాడారు. కార్యక్రమంలో అడ్వకేట్ బోనెల పరశురాం, ఐద్వానేత ఆర్.శ్రీదేవి, సీఐటీయూ నాయకులు జీవీ.రమణ, ఉమామహేశ్వరరావు, బి.సూరిబాబు, ఎం.రవి పాల్గొన్నారు.

అన్నదాత పోరుకు వైఎస్సార్‌సీపీ మద్దతు



బలిజిపేట: పార్టీ కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



సీతానగరం: వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు



సాలూరు రూరల్: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాలూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతానగరం: రాష్ట్రంలో పంటలు సాగు చేస్తున్న కారణంగా రైతులకు అవసరమైన యూరియా కూటమి ప్రభుత్వ పాలనలో సరఫరా చేయలేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అన్నదాతకు రాష్ట్ర వ్యాప్తంగా అండగా నిలవనున్నామని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో సోమవారం మండల పార్టీ కార్యాలయంలో అన్నదాత పోరు వాల్‌పోస్టర్‌ను మండల మండల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ పంటలు సాగు చేస్తున్న రైతాంగానికి ఎరువుల కొరత ఉండగా ప్రధానంగా యూరియా కోసం రైతులు నెల రోజులుగా ఇబ్బందులు పడుతున్నందున రైతులు ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా పోరుబాట పట్టాలని నిర్ణయించారన్నారు. అన్నదాత కష్టాలు చూసి అండగా నిలవాలని భావించి రైతన్నపోరు కార్యక్రమంలో అందరూ పాల్గొంటున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఎ.సింహాచలం, వై శ్రీనివాసరావు, వెంకట రమణ, జిల్లా, మండల పార్టీ నాయకులు బంకురు శంకరరావు, శంకరాపు వెంకటరమణ, సీహెచ్ సురేష్, ముకుందరావు, వై.గోపాల్ నాయుడు, వేణు, తిరుపతిరావు, జక్కు సతీష్, ఎం.రవి, గాదెలవలస సర్పంచ్ బొన్నాడ తిరుపతిరావు పాల్గొన్నారు.

అన్నదాత పోరుకు తరలి రండి

సాలూరు రూరల్: పార్వతీపురంలో రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు చేపడుతున్న అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులు పెద్దఎత్తున తరలిరావాలని సాలూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి సురేష్, సువ్వాడ భరత్ శ్రీనివాస్, దండి శ్రీను, కళ్లేపల్లి త్రినాథలు కోరారు. రైతులకు ఖరీఫ్ సీజన్‌లో అందించాల్సిన ఎరువులు సెప్టెంబర్ నెల వచ్చినా ఇంకా పూర్తిస్థాయిలో అందించడం లేదని దీనిపై వైఎస్సార్‌సీపీ రైతుల తరఫున ప్రభుత్వాన్ని నిలదీసే కార్యక్రమం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కురుకూటి నాయకుడు సాంబ, నెలపిట్ట కల్యాణ్ పాల్గొన్నారు.

పార్వతీపురంలో..

పార్వతీపురంరూరల్: పట్టణంలో, మండలంలను సోమవారం అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ,మండల నాయకులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మజ్జి శేఖర్, చందాన ఆనంద్, వైస్ఎంపీపీ బంకూరు రవికుమార్, జిల్లాపార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసరావు, అనుబంధ విభాగాల నాయకుడు మాధవరావు, సుధాకర్, వాసుదేవరావు, నాగరాజు, రెడ్డి రవికుమార్, ప్రకాష్, సదానందం, నేతాజీ, సందీప్, నాగరాజు, చంద్ర, ఉమ, సురేష్, గోవింద, గణేష్, వినోద్‌కుమార్, రాహుల్, పోలినాయుడు, తదితరులున్నారు.



పాచిపెంట: అన్నదాత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పార్వతీపురం రూరల్:పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు



పార్వతీపురం రూరల్: అన్నదాతపోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్వతీపురం పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇమామ్ మౌజాన్‌లపై చిన్నచూపు

- వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో నిరసన
- 11 నెలలుగా గౌరవ వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మైనార్టీ విభాగం నాయకులు

పార్వతీపురం రూరల్: కూటమి ప్రభుత్వం గత 11 నెలలుగా ఇమామ్‌లకు రూ.10వేలు చొప్పున, మౌజాన్లకు రూ.5వేలు చొప్పున ఇవ్వాల్సిన గౌరవ వేతనాలను చెల్లించకుండా మొండిచేయి చూపుతోందని వైఎస్సార్‌సీపీ అనుబంధ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్‌షఫీ ధ్వజమెత్తారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద మైనార్టీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇమామ్, మౌజాన్లకు గౌరవ వేతనం ఇస్తామని చెప్పి మాట తప్పారని ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లిం మైనార్టీల పట్ల కపట ప్రేమను ప్రదర్శిస్తున్నారన్నారు. మైనార్టీల అభ్యున్నతికి నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రెండడుగులు ముందుకేసి మైనార్టీలను ఆదుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఈ కార్యక్రమానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, స్థానిక మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు మైనార్టీ విభాగాల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ సభ్యులు షేక్ ఆదిల్, షేక్ జిలానీ, నూరుల్లా జలాల్, ఇబ్రహీం కరీమ్, సలీం బాబ్జీ, కోఆప్షన్ సభ్యుడు కరీమ్, మరికొంతమంది మత పెద్దలు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం

- డీపీఎంఓ డాక్టర్ రఘు



పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలిస్తున్న డీపీఎంఓ డాక్టర్ రఘు

సీతానగరం: పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన సేవలందించడంతో పాటు పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్యారోగ్య(డీపీఎంఓ)శాఖ ప్రాజెక్ట్ మేనేజరు డాక్టర్ రఘు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న సేవలు, చెత్త తొలగించడం, కాళీ మందుల కవర్లు, సీసాలు నిర్దేశించిన స్థలాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మందులు వాడిన తరువాత ఖాళీసీసాలు, డొక్కులు కవర్లు, సిరంజిలు, సీసాలు చెత్తకోసం కేటాయించిన డబ్బాల్లో వేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం ల్యాబ్ నిర్వహిస్తున్న, మందులిచ్చే గదులను, రోగులుండే వార్డులను పరిశీలించారు. సీతానగరం పీహెచ్‌సీలో వైద్య సేవలందిస్తున్న భవనం పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. డాక్టర్ పి.ఉషారాణి, సీహెచ్‌ఓ ఎస్వీరమణ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఫార్మసిస్ట్, ల్యాబ్‌టెక్నీషియన్, సిబ్బంది పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలోనే మామిడిపల్లి అభివృద్ధి

- సర్పంచ్ సువ్వాడ శశికళ




విలేకరులతో మాట్లాడుతున్న సర్పంచ్ శశికళ, వైఎస్సార్‌సీపీ నాయకులు

సాలూరు రూరల్: మండలంలోని ప్రధాన గ్రామమైన మామిడిపల్లి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి జరిగిందని, పారిశుధ్యం, తాగునీరు రోడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని గ్రామ సర్పంచ్ సువ్వాడ శశికళతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు సువ్వాడ రామకృష్ణ, పలువురు పార్టీ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం సర్పంచ్ ఇంటివద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల కూటమి ప్రభుత్వం పంచాయతీ అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయనప్పటికీ పారిశుధ్యం, తాగునీరు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. వర్షాకాలంలో తాగునీటి ట్యాంక్ పరిశుభ్రత పారిశుధ్యం క్రమం తప్పకుండా చేయిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తే గ్రామంలో మరింత అభివృద్ధికి తోడ్పాటు అవుతుందన్నారు. మామిడిపల్లి గ్రామంలో వీధిదీపాలు 2014లో టీడీపీ ప్రభుత్వంలోని వేసినవేనని, ఇప్పటివరకు వీధిదీపాలు కొత్తగా వేయలేదని ఆరోపించారని అది పూర్తిగా అవాస్తవమన్నారు.గ్రామ సర్పంచ్‌గా ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా వీధి దీపాలు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర గత ప్రభుత్వంలో గ్రామ అభివృద్ధికి అత్యధికంగా నిధులు మంజూరు చేయడంతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేయగలిగామన్నారు.

రైతన్నల ఇబ్బందులు పట్టవా?

- వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు రంగునాయుడు



విలేకరులతో మాట్లాడుతున్న రంగు నాయుడు

మక్కువ: ఖరీఫ్ సాగుకు అవసరమైన యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు అన్నారు. ఈ మేరకు స్థానిక పద్మశ్రీ థియేటర్ వద్దనున్న పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో రైతులు ఎరువులు కోసం ఏనాడు రోడ్డెక్కలేదన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి రైతులు ఎరువుల కోసం కోసం అనేక అవస్థలు పడుతున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు మంగళవారం పార్వతీపురం ఆర్డీవో కార్యాలయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అంతా వెళ్లి వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. యూరియా కోసం రైతుల క్యూలో నిలబడితే బఫే భోజనాలకు నిలబడున్నట్లు రైతులను ఉద్దేశించి మాట్లాడడం వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడికి సరికాదన్నారు. రైతులు ప్రతిరోజు యూరియా కోసం వివిధ ప్రాంతాలలో క్యూలో నిలబడి గంటల కొద్దీ వేచి చూస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎరువు కొరత లేదనడం దారుణమ న్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచి పంపిణీ చేయాలని కోరుతున్నట్లు రంగనాయుడు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలపై రాజకీయ వేధింపులు ఆపాలి

- ఐద్వా నాయకుల డిమాండ్

పార్వతీపురం: మహిళా సంఘాల సభ్యుల(డ్వాక్రా)పై రాజకీయ వేధింపులు ఆపాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి ఒక ప్రకటనలో సోమవారం డిమాండ్ చేశారు. పాచిపెంట మండలం మైసూరు గ్రామానికి చెందిన వరలక్ష్మీ గ్రూప్ సభ్యులు గత నాలుగు సార్లుగా బ్యాంకు నుంచి తీసుకున్న రుణ మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించారని, ఐదవ విడత రుణం కోసం దరఖాస్తు చేసుకుంటే వెలుగు ఏపీఎం, సీసీలపై కూటమి నాయకులు కలుగజేసుకుని వరలక్ష్మి గ్రూపునకు రుణం ఇవ్వకుండా అడ్డుపడుతున్నారన్నారు. మహిళా సంఘాల తరఫున రుణాలు తీసుకోవడం, తిరిగి చెల్లించడం మహిళల హక్కు అన్నారు. దీనిపై రాజకీయ జోక్యం సరికాదన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడాలంటే రుణాలు ఇవ్వాలని నిత్యం ప్రకటనలు గుప్పిస్తున్న పాలకులు ఇలా పొదుపు సంఘాల మహిళలపట్ల అనుచితంగా వ్యవహరించడం పాలకుల విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. పొదుపు సంఘాలకు రుణాలు ఇవ్వాలని, పొదుపు సంఘాలపై రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. లేదంటే భవిష్యత్‌లో డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పశువుల శాలలు శుద్ధి చేయాలి



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ శ్రీనివాసరావు

సీతానగరం: గ్రామాల్లో కురుస్తున్న చిరుజల్లుల కారణంగా దోమలు ఎక్కువగా పాడి పశువులున్న శాలల్లో స్థావరాలు ఏర్పటు చేస్తున్నందున పాడిరైతులు దోమల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని బుడ్డిపేటలో దోమల బెడదను ఎదుర్కొంటూ జ్వరాలతో పశువైద్య కేంద్రానికి వచ్చిన పశువులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పాడి పశువులను దోమలు కుట్టడం వల్ల జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని తెలియజేశారు. దోమలు కుట్టడం వల్ల జ్వరం రావడంతో పాడి దిగుబడి తగ్గుతుందన్నారు. దోమల నివారణకు పాడి రైతులు ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవాలని, ఎబెట్ మందు ద్రావణాన్ని పశువుల శాల పరిశ్రప్రాంతాల్లో పిచికారీ చేయాలని, శాలల్లో చెత్తనిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగింపు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

అధ్వానంగా కుమ్మరివలస రోడ్డు

- నిర్మాణం మధ్యలో నిలిపివేసిన కాంట్రాక్టర్
- పనులు పునఃప్రారంభించాలని కోరుతున్న గ్రామస్తులు



యారడ్లవలస సమీపంలో గోతులతో అధ్వానంగా ఉన్న కుమ్మరివలస వెళ్లే రోడ్డు



గుమ్ములతో ఉన్న కుమ్మరివలస సమీపంలో రోడ్డు

పాచిపెంట: మండల కేంద్రం నుంచి యారడ్లవలస మీదుగా కుమ్మరివలసకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రూ.మూడు కోట్ల 60 లక్షలతో తారు రోడ్డు మంజూరైంది. పనులు కూడా ప్రారంభమయ్యాయి, ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి, తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం వేరే వ్యక్తికి పనులు అప్పగించింది. అయితే ఆ వ్యక్తి పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశాడు, దీని మూలంగా ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై వేసిన మెటల్ పూర్తిగా కొట్టుకుపోయి పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. అధికారులు తక్షణమే స్పందించి రహదారి పనులు పునః ప్రారంభించాలని యారడ్లవలస గ్రామస్తుడు బడ్నాన జోగారావు తదితరులు కోరుతున్నారు.

చెత్త కుండీల నుంచి చెత్త తొలగించండి



చెత్త కుండీలో పేరుకుపోయిన చెత్త

పాచిపెంట: చెత్త కుండీల నుంచి చెత్తను తొలగించాలని మండల కేంద్రానికి చెందిన బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న సమీప ఇళ్ల ప్రజలు కోరుతున్నారు. బైపాస్ రోడ్డు కిరువైపులా చెత్త సేకరణ కోసం చెత్తకుండీలు ఏర్పాటు చేశారు. సమీప ఇళ్ల ప్రజలు తమ ఇంట్లో ఉన్న తడి పొడి చెత్తను తీసుకువచ్చి చెత్తకుండీలో వేస్తున్నారు. అయితే అలా వేసిన చెత్తను రోజుకు ఒకసారి లేక రెండు రోజులకు ఒకసారి పంచాయతీ పారిశుద్ధ్య వాహనాల ద్వారా ఊరి శివారున ఉన్న డంపింగ్ యార్డుకు తరలించాలి. కానీ అలా చేయకుండా, నెలల తరబడి అలా వదిలేస్తున్నారు. దీని వల్ల చెత్త కుండీలో చెత్త కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. అసలే వర్షాకాలం కావడంతో దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు వ్యాపించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్తకుండీలో ఉన్న చెత్తను తొలగించాలని వారు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషిచేయాలి



మాజీ ఎమ్మెల్యే జోగారావును మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా ఎస్సీ సెల్ విభాగాల ఇన్‌చార్జి దేముడు బాబు, ఎస్సీసెల్ విభాగాల నాయకులు

పార్వతీపురం రూరల్: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసే విధంగా కృషి చేయాలని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగాల ఇన్‌చార్జి దేముడు బాబు, నియోజకవర్గాల అధ్యక్షులు సోమవారం మాజీ ఎమ్మెల్యే జోగారావును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పార్టీ కార్యక్రమాలపై మాట్లాడారు. జిల్లా, నియోజకవర్గ స్థాయిలో గల పార్టీ ఎస్సీ సెల్ అనుబంధ విభాగాల అన్ని నియామకాలను పూర్తి చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేసేందుకు నియోజకవర్గాల ఎస్సీ సెల్ అధ్యక్షులు, నాయకులు అందరితో సమన్వయం చేసుకుని పార్టీని పటిష్ట స్థితిలో నిలిపేందుకుగాను, అందరం కలిసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా జోగారావు వారికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, పార్టీ అధికార ప్రతినిధి ముద్దల సత్యం నాయుడు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోల సుధాకర్, రాష్ట్ర అనుబంధ విభాగాల కార్యదర్శులు కాగాన ప్రకాష్, దేవుపల్లి నాగరాజు, కౌన్సిలర్ లు వండాన నేతాజీ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు సంభవించరాదు

పార్వతీపురంటౌన్: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, మాతృ మరణాలు సంభవించకుండా కార్యాచరణ చేపట్టాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎండీఆర్ కమిటీ సమావేశం జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. గత నెలలో సంభవించిన గర్భిణి మతిపై కమిటీ సమీక్ష చేసింది. గర్భిణిగా నమోదైన నాటి నుంచి వైద్య పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు సకాలంలో నిర్వహించారా? పర్యవేక్షణ చేశారా? ఏ ఆరోగ్య సమస్య కారణంగా రిఫర్ చేశారు వివరాలపై సంబంధిత అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బందిని ఆరా తీశారు. రిఫరల్ ఆస్పత్రి గైనకాలజిస్ట్ ఆ సమయంలో గర్భిణికి నమోదైన ఆరోగ్య సమస్యలు, అందజేసిన చికిత్స వివరాలపై వివరించారు. గర్భిణి మృతికి గల కారణాలపై కమిటీ విశ్లేషించింది. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ గర్భిణి ఆరోగ్య రీత్యా వైద్యారోగ్యశాఖ నిర్దేశించిన ప్రతి కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని, గర్భిణి ఆరోగ్య విషయమై వైద్యసిబ్బంది జాప్యం వహిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ నాగభూషణరావు, డీఐఓ డా. విజయమోహన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.పద్మావతి, సూపరింటెండెంట్ నాగశివజ్యోతి, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగన్మోహన్, డా కౌశిక్, బ్లడ్ బ్యాంక్ నోడల్ అధికారి డా.రాజ్, డా.పద్మజ, డీహెచ్ఎన్ఓ ఉషారాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.